క్లుప్తంగా

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలు, ప్రత్యేకాభిషేకాలను ఆదివారం నిర్వహించారు. స్వామి, అమ్మవారికి తిరుప్పావై సేవను జరిపారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు.

దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



ఇందుకూరుపేట : పవిత్ర కార్తీక మాసంలో పార్వతీ పరమేశ్వరుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో విశ్వబ్రాహ్మణ కార్తీక వనభోజన మహోత్సవం ఆదివారం జరిగింది. ముందుగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ గాంధీ నడయాడిన ప్రాంతంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నేత గానాల రామ్మూర్తి విగ్రహ ఏర్పాటుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. తొలుత ఆశ్రమ ఆవరణలోని గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి శానంపూడి సుబ్బనాచారి, సుజాత కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆశ్రమ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, గంపల మంజుల, ఆశ్రమ మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



కోవూరు : కోవూరులోని పచ్చిపాల రామనాధమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్రీడాకారులను ఆదివారం అభినందించారు. హెచ్‌ఎం నరసింహమూర్తి మాట్లాడుతూ విజయనగరం జిల్లా రాజీవ్ స్టేడియంలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాక్సింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

బుచ్చిరెడ్డిపాళెం సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ హైమారావు

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.హైమారావు తన కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ రామారావు గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో హైమారావు బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణకు కృషి చేస్తానని నూతన సీఐ తెలిపారు.

ట్రై సైకిల్ అందజేత

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన దివ్యాంగుడు మాణికల మారయ్యకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆదివారం ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వీపీఆర్ ట్రస్ట్ ద్వారా సైకిల్‌ను సమకూర్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుంబాక మహీధర్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్‌గౌడ్, సర్పంచ్ నిరంజన్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కొడవలూరు : మండలంలోని నార్లురాజుపాళెంలో వనమా శేషయ్య, పద్మావతమ్మ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. దాదాపు 200 మంది పేదలకు ట్రస్ట్ నిర్వాహకులు దొరడ్ల సత్యనారాయణ, లలితమ్మ దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు శశిధర్, వెంకట సుప్రజ, ఉదయ్‌కిరణ్, కాంచనలక్ష్మి పాల్గొన్నారు.

దేవుని దయ..సీఎం ప్రోత్సాహంతో మంత్రినయ్యా

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



గురువులను సత్కరించి మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): దేవుడి దయ..సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో మంత్రిని అయ్యానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరులోని దువ్వూరు నారాయణరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1978–79 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి మంత్రి కాకాణితో పాటు పలువురు పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ 2014, 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి బీఫాం ఇవ్వడంతో ఎమ్మెల్యేగా గెలిచానని, ఆ తరువాత మంత్రి పదవి కూడా ఇచ్చి నాలుగు శాఖలను కేటాయించారని పేర్కొన్నారు. ఆయా శాఖలలో తనతో పాటు 18 మంది ఐఏఎస్‌లు పనిచేస్తున్నారని చెప్పారు. తాను ఐఏఎస్ చేయాలని తన తండ్రి కోరుకున్నారని, అయితే తనకు చదువంటే ఇష్టం లేక మానుకోవాలనుకున్నానని, పెద్దలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతి ప్రథమశ్రేణిలో పాసయ్యానని తెలిపారు. ఆ రోజుల్లో ఫస్ట్ క్లాస్ వచ్చినా వీఆర్ కళాశాలలో సీటు రావడం చాలా కష్టమైందని, వెయిటింగ్ లిస్టులో సీట్ తెచ్చుకుని ఇంటర్మీడియట్ చదివానని గుర్తుచేసుకున్నారు. ఒక సంవత్సరం వృథా అయిందన్నారు. ఆ సమయంలో చదువు మానడం తప్పిదమని గ్రహించి కర్ణాటకలో ఇంజినీరింగ్ పూర్తి చేశానని తెలిపారు. ఆ తరువాత వ్యాపార రంగంలోకి ప్రవేశించానని అక్కడ పట్టిందల్లా బంగారం అయిందన్నారు. తన తండ్రి 18 ఏళ్ల సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారని, తనకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశం కలిగిందని చెప్పారు. 2014, 2019లలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎమ్మెల్యే అయ్యానని, ఆయన దయతో మంత్రిని అయ్యానని పేర్కొన్నారు.

చిన్ననాటి మిత్రులను కలవడం సంతోషంగా ఉంది

తనతో పాటు పదో తరగతి చదువుకున్న మిత్రుల అందర్నీ 44 ఏళ్ల తరువాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని మంత్రి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మిత్రులను చూస్తుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయన్నారు. కొంతమంది తరుచూ, మరికొంతమంది అప్పుడప్పుడు తనను కలుస్తూనే ఉన్నారని, అందరిని ఒకేసారి కలుసుకోవడం మరుపురాని విషయమన్నారు. ఏటా కానీ, కనీసం రెండేళ్లకు ఒకసారి అయినా పూర్వ విద్యార్థులందరం కలుసుకోవాలన్నారు. బాధైనా, సంతోషమైన భగవంతుడి తరువాత చెప్పుకునేది స్నేహితుడితోనేని అన్నారు. తమకు చదువు చెప్పి ఈ స్థితికి రావడానికి కారణమైన ఉపాధ్యాయులు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడ్ని కోరుకుంటున్నామన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి

మంత్రి బ్యాచ్‌మెట్లు, గురువులు మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డి తన తండ్రిని మించిన తనయుడు అయ్యారని, తమ మిత్రుడు మంత్రిగా కీలక పదవిలో ఉండడం సంతోషంగా ఉందని జీవితంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. తన బ్యాచ్‌మెట్లు, గురువులను మంత్రి శాలువాలతో సత్కరించారు. అనంతరం మంత్రి కాకాణిని బ్యాచ్‌మెట్లు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురువులు సుబ్బరామిరెడ్డి, జోసెఫ్, బ్యాచ్‌మెట్లు కామేష్, సూరి, రాంప్రసాద్, సుజనమ్మ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



కార్తీక దీపాన్ని వెలిగిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసం బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మైపాడ్‌గేట్ మిత్ర మండలి ఆధ్వర్యంలో మైపాడ్ గేట్ సెంటర్‌లోని తెప్పోత్సవ ఘాట్ వద్ద కార్తీక దీపోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ పాల్గొని శివలింగానికి, శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కార్తీక దీపాన్ని వెలిగించి జాఫర్‌సాహెబ్ కాలువలో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఏటా కార్తీక మాసంలో మైపాడు గేట్ ప్రాంతంలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ ఏడాది మైపాడ్ గేట్ మిత్రమండలి ఆధ్వర్యంలో మద్దూరు సుబ్బారావు పర్యవేక్షణలో కార్తీకదీపోత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. మంచి మనస్సుతో కార్యక్రమాన్ని చేపట్టిన మద్దూరు సుబ్బారావుకు, నగర ప్రజలకు పరమేశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, వారి కోరికలు తీరాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైపాడుగేట్ మిత్ర మండలి సభ్యులు మద్దూరు సుబ్బారావు, కార్పొరేటర్లు పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, ఓబిలి రవిచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు సంక్రాంతి కల్యాణ్, మద్దినేని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో నగర ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని సూచించారు. సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్



నెల్లూరు (టౌన్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మూడ్రోజులుగా జరుగుతున్న కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థుల ఇంటర్ స్పోర్ట్స్ మీట్ ఆదివారంతో ముగిసింది. చివరి రోజు కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. క్రీడాజ్యోతిని వెలిగించి ఫైనల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. గత 26 ఏళ్లుగా తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహాన్ని ఇస్తున్నామని తెలిపారు. ప్రధానంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, చెస్, క్యారమ్స్, క్రికెట్, వాలీబాల్, తదితర పోటీలు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్స్ శిరీషా, రామాంజనేయులురెడ్డి, సుధారాణి, రాంగోపాల్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



నెల్లూరు (బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పడారుపల్లి, దివ్యాంగుల కాలనీలోని పీసీరెడ్డి సమాజ మందిరంలో క్రాంతి మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడివెంకట లక్ష్మి ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులు, బాలలకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ కురిమేటి జానకిరామయ్య, ప్రమీలమ్మ దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి రాజగోపాలరెడ్డి, గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మండల పూజలు



అయ్యప్పస్వామి శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): మండల పూజోత్సవాల్లో భాగంగా వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. కేరళ సంప్రదాయంగా శీవేలి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు భక్తులు విశేషంగా హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, స్నేహలత, రంగారెడ్డి, అజిత, వెంకటేష్, సందీప్‌రెడ్డి వ్యవహరించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం పాలకమండలి నిర్వాహకులు జీ శేషగిరిరావు, కే వెంకటరత్నం, జీ రత్నయ్య, కే మోహన్‌రావు, బీ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

సమాజానికి సందేశాత్మక లఘు చిత్రాలు అందించాలి

- సినీనటుడు సుమన్



కెమెరా స్విచ్ఛాన్ చేస్తున్న నటుడు సుమన్

నెల్లూరు(బృందావనం): సమాజానికి ఉపయుక్తమైన లఘు చిత్రాలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని ప్రముఖ సినీ నటుడు, డిస్ట్రైన్‌స్టార్ సుమన్ కోరారు. జగన్ క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మితమవుతున్న ''సాహసం'' షార్ట్‌ఫిల్మ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మినర్వాగ్రాండ్ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై కెమెరా స్విచ్ఛాన్ చేయగా, ప్రత్యేక అతిథిగా విచ్చేసిన 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి క్లాప్‌కొట్టారు. ఈ సందర్భంగా నటుడు సుమన్ మాట్లాడారు. తనకు నెల్లూరుతో 40ఏళ్లకు పైగా అనుబంధం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన కళాకారుడు, లఘుచిత్రాల నిర్మాత రషీద్ 40 ఏళ్ల నుంచి తన అభిమానిగా ఉన్నారన్నారు. లఘుచిత్రాలను నిర్మిస్తూ, దర్శకత్వం చేస్తున్న రషీద్ భవిష్యత్తులో చిత్రదర్శకుడిగా, నిర్మాతగా ఎదగాలని ఆకాంక్షించారు. తన వంతు తోడ్పాటు రషీద్‌కు ఎల్లవేళలా ఉంటుందన్నారు. 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కళాకారుడైన తమ సంఘంలో సభ్యుడైన రషీద్‌కు 25కళాసంఘాల సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు. రషీద్ తన ప్రతిభాపాటవాలలో చలనచిత్రరంగంలో రాణించాలన్నారు. లఘుచిత్రం కథా రచయిత, సహదర్శకుడు రషీద్ మాట్లాడుతూ మొబైల్‌ఫోన్, మహిళల ఇతివృత్తంతో సందేశాత్మకంగా లఘుచిత్రం నిర్మితమవుతుందన్నారు. త్వరలో చేపట్టనున్న చిత్రానికి సంబంధించి కథను నటుడు సుమన్‌కు వివరించామన్నారు. నటీనటులు, సాహసం లఘుచిత్రం డైరెక్టర్ కేఎం రాము, కెమెరామెన్ కరుణ, హీరోయిన్లు ఎస్కే సూఫియా పర్వేజ్, కరీష్మా, రావూరు వెంకటేష్, సుకుమార్, ఖమర్‌తాజ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక వనసమారాధన



కార్తీక వనసమారాధన పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లూరు రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డులోని మహామృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహారుద్రాభిషేకం, వన సమారాధన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, లక్ష తులసీ పూజ, లక్ష కుంకుమార్చన, మృత్యుంజయ హోమం, ఉసిరిక చెట్టుకు పూజలను వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి బ్రాహ్మణులు తరలివచ్చి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. బ్రాహ్మణ సేవా సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమితి సభ్యులు కేఎల్ నారాయణ, కామేశ్వరప్రసాద్, శ్రీనివాసరంగరాజన్, శ్రీనివాసమూర్తి, నారాయణరావు, జయలక్ష్మి, పద్మావతి, ప్రతిభారాణి, ప్రసాద్, రాఘవేంద్ర, సుబ్రహ్మణ్యం, శారద, ఆలయ ప్రధానార్చకుడు గంగా ప్రసాద్ పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాల ఏర్పాటు అభినందనీయం

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



వనభోజన మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసం సందర్భంగా అర్చక బృందం ఆధ్వర్యంలో నగరంలో నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాస వనభోజన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సహస్ర లింగార్చన, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించారు. నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ పాల్గొని తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా వన భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పరమేశ్వరుని కృపాకటాక్షాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ,నగర ప్రజలకు ఎల్లవేళలా ఉండాలన్నారు. బ్రాహ్మణ సంఘం, అర్చక సంఘం సభ్యులు పారా శ్రీధర్‌శర్మ, మల్లిస్వామి, కార్తీక్, శర్మ, ఉమ్మయ్య, కిషోర్, ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు, చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రాగాల పల్లకి



నెల్లూరు(బృందావనం): నగరంలోని రేబాలవారి వీధిలోని సుస్వర వరల్డ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కళావేదికపై ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన గాయనీగాయకుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు ఆలపించిన సినీగీతాలతో కళావేదిక పులకించింది. ఈ కార్యక్రమానికి శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు, కొండూరు హరి నారాయణరెడ్డి చారిటబుల్‌ట్రస్ట్ చైర్మన్ కొండూరు హరినారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. కళాకారులకు ఇచ్చే విలువైన బహుమతి ప్రోత్సాహమేనన్నారు. ప్రతిభగల కళాకారులను సమాజం ప్రోత్సహించి ఆదరించాలన్నారు. అనంతరం గాయకులను సత్కరించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, గ్రూప్ అడ్మిన్ రాహుల్ బాబు, లక్ష్మణ్‌రాజు, పీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి కే వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

నెల్లూరురూరల్: ప్రతిఒక్కరూ తమ హక్కులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ సివిల్ జడ్జి కే వాణి అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ యువత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అవినీతి నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మావవ హక్కుల సంఘాల నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి సహకారంతో డీసీసీబీ బలోపేతం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) మరింత బలోపేతం అవుతుందని, బ్యాంకు అభివృద్ధికి వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ పూర్తి సహకారం అందిస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్ పాల్ అన్నారు. నగరంలోని మాగుంట లే అవుట్‌లోని ఎక్సోటికా రెస్టారెంట్‌లో డీసీసీబీ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కుమార్‌పాల్ మాట్లాడుతూ వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ బలోపేతానికి జిల్లా యూనియన్ నాయకులు మరింత కృషి చేయాలన్నారు. త్వరలో జరిగే ఉద్యోగుల వేతన సవరణలో మెరుగైన వేతనాన్ని సాధించేలా యూనియన్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. డీసీసీబీ రూ.2వేల కోట్ల వ్యాపార లావాదేవీలు, రూ.500 కోట్ల డిపాజిట్ల సేకరణను లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకు సిబ్బందితో పాటు యూనియన్ సభ్యులందరూ కష్టపడాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రుణాలు ఇచ్చే స్థాయి నుంచి ఇతర వాణిజ్య బ్యాంకులకు పోటీగా నేడు డీసీసీబీ వ్యక్తిగత, గృహ, వాహన రుణాలతో పాటు వ్యాపార సంస్థలు, పొదుపు గ్రూపులకు అతితక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తోందని తెలిపారు. డీసీసీబీ, పీఏసీఎస్‌ల బలోపేతానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నారని, వారికి యూనియన్ తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు బాబు, ప్రజ్ఞా,రియాజ్, జిల్లా నాయకులు హరి, సుష్మారెడ్డి, సాజిదా, గాయత్రి, క్రాంతి, తేజశ్విని, స్వాతిసురేఖ, సాయిలీల, సుధాకర్, కోటేశ్వరరావు, రామనారాయణ, ఫణీంద్రబాబు, శివ, గౌస్ మహేష్, ఉదయ్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు



మాట్లాడుతున్న దాసరి రాజేష్

నెల్లూరు(బారకాసు): కక్ష పూరితంగానే తన ఇంటి వద్ద చెత్త, కూలిన చెట్లను తొలగించలేదని మాజీ మేయర్ భానుశ్రీ తనపై చేసిన ఆరోపణలలో వాస్తవం లేదని.. కేవలం రాజకీయ లబ్ధి కోసమే అవాస్తవ ఆరోపణలు చేశారని వైఎస్సార్‌సీపీ 38వ డివిజన్ ఇన్‌చార్జి దాసరి రాజేష్ పేర్కొన్నారు. నగరంలోని శోధన్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ దాసరి అమృత, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం శోధన్‌నగర్‌లో నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది తుఫాన్‌కు పడిపోయిన చెట్లు, కొమ్మలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేపడుతుండగా మాజీ మేయర్ భానుశ్రీ తన కుటుంబ సభ్యులతో కలిసి ముందు తమ ఇంటి ముందున్న వాటిని తొలగించాలని బెదిరిస్తూ దౌర్జన్యానికి దిగారని ఆరోపించారు. ఈ విషయాన్ని తెలుసుకుని తాను అక్కడికి వెళ్లి మాట్లాడుతుండగా తనపై దాడికి యత్నించారన్నారు. టీడీపీ డ్రామాల్లో భాగంగా మాజీ మేయర్ తమపై అవాస్తవ ఆరోపణలను చేశారే తప్ప అందులో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. తనను వ్యక్తిగతంగా దెబ్బతీయడానికి భానుశ్రీ ఆరోపణలు చేశారని, ఒకరి గురించి మాట్లాడేటప్పుడు ముందు తామేమిటో తెలుసుకుని మాట్లాడాలని హితవుపలికారు. తాను మద్యం సేవించి ఆమెను దుర్భాషలాడినట్లు, దాడి చేసినట్లు తప్పుడు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. భానుశ్రీ మేయర్‌గా ఉన్నప్పుడు స్వయంగా ఆమె యజమానిగా ఉండి మద్యం బార్‌ను నడిపిన సందర్భాన్ని మర్చిపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఉన్నతమైన పదవిలో ఉండి బార్ నడిపి ప్రజలను అనారోగ్యం పాల్జేసిన మీరా తన గురించి మాట్లాడేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో నీరు నిల్వ చేరడానికి ప్రధాన కారణం పంట కాలువలు ఆక్రమణకు గురికావడమేనన్నారు. భానుశ్రీ మేయర్‌గా ఉన్న సమయంలో ఆక్రమణకు గురైన కాలువలపై చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆమె ఉంటున్న నివాసాన్ని కాలువ ఆక్రమించి కట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భానుశ్రీ భర్తకు విద్యుత్‌శాఖలో డైరెక్టర్ పదవి అవకాశం కల్పించిన విషయాన్ని మరిచి నేడు పార్టీని, పార్టీ నేతలను ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం నది దాటిన తరువాత తెప్ప తగలేయడమేనన్నారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రూరల్ నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుండడాన్ని చూసి ఓర్వలేక టీడీపీ ఇలాంటి డ్రామాలకు తెరలేపుతుందన్నారు. 38వ డివిజన్ ప్రజలు మొదటిసారి తనను, రెండోసారి తన సతీమణిని కార్పొరేటర్లుగా గెలిపించారని తెలిపారు. దమ్ముంటే భానుశ్రీ ఇదే డివిజన్‌లో పోటీ చేసి గెలవాలని దాసరి రాజేష్ సవాల్ విసిరారు. 38వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు అలీమ్‌భాయ్, ఖలీల్, సర్దార్, బషీర్, ఫరీదా, ఉమియా, మల్లిక, జ్యోతి, షెహరా జ్, సునీల్, రాజేష్, టింకు తదితరులు పాల్గొన్నారు.